పిచ్చి పిల్ల ★ శ్రీ చామర్తి కనకయ్యగారు

తెల్లవారి '7' గంటలైనా కాఫీ కడుపులో పడక పోవడంవల్ల గంటనుంచి వ్రాస్తున్న కథను పూర్తి చేయ లేకపోయాడు 'విశ్వం'. రెండు మూడు సిగరెట్లు తగులడినా చురుకులేదు. వేడి వేడి కాఫీకి సాటి వస్తుందా సిగరెట్! కాగితం కలం బల్లమీదుంచి మెల్లిగా వంటింట్లోకి వచ్చి చూచాడు. పాలన్నీ పొంగి పొయ్యిలో పడిపోతున్నా గిన్ని దింపకుండా చూస్తూకూర్చుంది సీత. అతని కెక్కడలేని కోపంవచ్చింది. ఏదో ఆమెను అందా మనుకొన్నాడు. అన్నాడు—కాని ఆ మాటలు అతని నోటినుంచి మాత్రం వెలువడ లేదు. "ఇంట్లో వంట చెఱకుకు కూడా గతిలేదు" అంటూనే పాలగిన్ని క్రిందకుదింపి సణుగుకొంటూనే గదిలోకి వెళ్ళిపోయింది. ఆమెకు ఎప్పుడు కోపం వస్తుందో, ఎప్పుడు సంతోషం వస్తుందో అతనికి ఇప్పటికీ అర్థమవలేదు. ఏమీ తోచక ఇటూ అటూ పచారు చేశాడు పది నిమిషాలసేపు. "పెద్ద . రచయితలు—స్త్రీల విషయాలన్నీ బాగా తెలిసినవారు... ఈ మాత్రం తెలియక పోయిందే" అంది ఈసడిస్తూ—

ఆ వేళకి ఏదో రకంగా జరిగిపోయింది—

మర్నాడు—

విశ్వం మళ్ళీ కథ వ్రాస్తున్నాడు. మూడు రోజులై మొదలు పెట్టినా ఆ కథమాత్రం పూర్తవలేదు. దానిని ఎలాగైనా పూర్తిచేసి పోస్టు చేయాలని అతని వుద్దేశం. క్రితం రోజునే అతని అక్కగారు 'సరోజిని' వచ్చింది. ఇంట్లో 'ఇవి లేవు' అవిలేవు' అని అతన్ని దెప్పి వెళ్ళింది. అతను బి.ఎ., ప్యాసయినా తననూ తన భార్యను పోషించుకోవడం చాలా ఇబ్బందిగావుంది. "బి.ఎ. లూ, ఎమ్. ఏలూ., తిండి పెట్టవు" అని ఒకసారి తన తండ్రి ఏదో సందర్భంలో వాళ్ళమ్మతో అన్నట్లు జ్ఞాపకం వచ్చింది. జ్ఞాపకం రావడమేమిటి! అతనికి మాత్రం ఇప్పుడు తెలియటం లేదా! చచ్చిచెడి ప్యాసయిన బి. ఎ., అనే రెండక్షరాలూ తనకు చేసిన సహాయం లేదు కదా! ఉద్యోగంలేని అతనికి, ఏ కూలి పనికైనా వెళ్ళడానికి అడ్డువస్తున్నాయి. బి. ఎ., ప్యాసయి రెండుసంవత్సరాలైంది. 125 అప్లికేషన్లు తపాలా పెట్టెలో పడ్డాయి. ఆ 125 కూ ఒక్క సమాధానానికి కూడా, అతను నోచుకోలేదంటే మీరు నమ్మరు. మలమల మాడే ఆ పొట్టతోనూ, కారుమేఘాల్లాంటి ఆలోచన చేసే ఆ బుఱ్ఱతోనూ అతను కథా కారుడయ్యాడు. ఈ కథల రోగం అతను కాలేజిలో చదువుకుంటున్నప్పటి నుండివుంది. అప్పుడు కాలక్షేపానికి, వినోదం కోసం వ్రాసే వాడు. ఇప్పుడు కడుపుమంటను చల్లార్చుకోవడంకోసం వ్రాసుకుంటున్నాడు. అతనికి ఆ గ్రామంలోనే రెండెకరాల మాగాణీ భూమివుంది. దానిమీద వచ్చే ధాన్యం అతనికీ అతని భార్యకూ ఒక మోస్తరుగా ఏడాదికి సరిపోతవి. "దిక్కుమాలినవూరు, దిక్కుమాలిన కొంప అని నిత్యం అనే సీత మాటలకి 'విశ్వాని'కి ఉద్యోగం చేయాలనే ఉద్దేశం కలిగి 125 అప్లికేషన్లు పోస్టుచేశాడు. ఉద్యోగం విషయమే తెలిసి రాకపోతే, అతను ఏ పొలంగట్టునో, ఏ గోదావరి ఇసుక తిన్నెలమీదో కూర్చుని నిశ్చింతగా కథలు వ్రాసుకుంటాడు. —వ్రాస్తున కథలో లీనమైన అతని మస్తిష్కంలో గుఱ్ఱాలుపరువెత్తినట్లయింది, సీత చేసిన చప్పుడుకు—అమె వైపు అలా చూస్తున్నాడు— "కాగితం నలుపు చేయడం కంటె మీకు మరేవిషయం మీదైనా దృష్టిఅంటూ వుంటోందా?" అంది వ్యంగంగా—అతని రచనా వ్యాసంగం గురించి సీత అప్పుడప్పుడు హేళనగా అనే మాటలు అతనికెంతో కష్టమనిపించాయి—కాని ఏం చేస్తాడు! ఏం చేయడమేమిటి? భార్యకు తగిన బుద్ధి చెప్పక్కర్లే! దేహశుద్ధి చేయకూడదూ! అతను అలాచేయడానికి అతని మనస్సు ఇష్టపడదు. ఇష్టం కాని పని అతను చేయడు. చేయలేడు. "సీత"ను కొడితే మాత్రం అతనికి వొరిగిందేమిటి?

"ఏం చేస్తున్నావురా?" అంటూ, విశ్వం స్నేహితుడు జోళ్ళు టక్ టక్ మంటూ చప్పుడు చేస్తూవచ్చి ప్రక్కన కుర్చీలో చతికిల బడ్డాడు.

"ఎప్పుడు చూసినా ఏదోరాస్తూ కూర్చుంటావ్. గడ్డి కోసుకునైనా రోజూ బేడడబ్బులు సంపాదించవచ్చు కాని

కథలు వ్రాసేవానికి ఆమాత్రంలేదు. ఎందుకొచ్చిందీ గొడవరా" అన్నాడు వచ్చిన స్నేహితుడు తిన్నగా కూర్చోక—ఈ మాటలు విశ్వంవినక పోలేదు—అవతల గదిలో కూర్చుని సీతవింటూంది—అతనికి సమాధానంగా "సింహం ఆకలిగావున్నా గడ్డి తినదు—కళాకారుడు దరిద్రుడైనప్పటికి తన కలాన్ని గంగలో విసిరి తవ్వుగోల పుచ్చుకోలేదు. ఉత్తమ కథకులకు రెండుపూటలా తిండికి దిక్కు లేదంటే అది రోజుల మహత్యమూ, దేశ దౌర్భాగ్యమే" అంది సీత ఉద్రేకంతో—సీతకి కూడా విశ్వం కథలంటే ఇష్టమే. అతి సహజంగా వుంటాయని ఆమెకూ తెలుసు. అయినప్పటికి ఇంట్లోగడవడం ఎలా, అనే సమస్యపైనే ఆమెకు అతనిపై విసుగు—"ఏదో సరదాగా అన్నాను. ఆగ్రహించకండి వదినా" అన్నాడు వచ్చినస్నేహితుడు తనేదో పెద్ద తప్పు చేసేనేమో అని అభిప్రాయ పడుతూ—తన తండ్రిని కాదని, బీదవాడైనా విశ్వాన్నే ప్రేమించి పెండ్లి చేసుకుంది సీత. తాను విశ్వాన్నే పెండ్లాడి తీరుతానని, తండ్రి డబ్బున్న సంబంధాన్ని తీసుకురావడానికి ప్రయత్నించినప్పుడు, పట్టుపట్టి, నాలుగు రోజులు అన్నంమాని ఏరికోరి విశ్వాన్నే పెండ్లిచేసుకుంది. అటువంటప్పుడు ఇంట్లో ఇదీ అదీ లేకపోతే సరిపెట్టుకోవాలి; ఆమెకూ తెలుసు. అయితే మాత్రం ఆమెకు నిగ్రహించే శక్తిలేక పోతోంది—పట్నవాసంనుంచి పల్లెటూరు రావడంతో ఆమెకా వాతావరణం 'చీదర'అనిపించింది. ఎప్పుడు పట్నాన్ని చూస్తానా అని ఆమె హృదయం తహతహ లాడింది. పట్నానికి వెళ్ళినా పట్టుమని పదిరోజులైనా వుండకుండానే తిరిగి పుట్టింటి నుంచి వచ్చేసింది, భర్త ఎలా గడుపుతున్నాడో ఒంటరితనాన్ని అని.

*   *   *

అంతకు క్రితంరోజునే తన కథలకు పారితోషికంగా పత్రికవాళ్ళు పంపిన 25 రూపాయలతో రెండుచీరలు తీసుకొచ్చాడు విశ్వం—సీత, విశ్వం తెచ్చిన చీరలను చూసి సంతోషం వెలిబుచ్చలేదు సరిగదా, "చాలా కష్టపడ్డారులెండి. ఇలాటి చీరలు మా ఇంట్లో దాసీవాళ్లు కూడా కట్టుకోరు"అని కస్సుమంది. నాలుగు నెలల్నుంచి అటువంటి ముతక చీరలే కట్టుకుంటూంది. మరి ఇప్పుడో—అతని కథల్లో నిత్యమూ స్త్రీ పురుషులు వస్తూ పోతుంటారు. వారికి అతని భార్యకి మధ్య కొన్ని యోజనాల దూరం వుంటుంది—చేసేది లేక చీరలు కొట్టులో ఇచ్చేసి తిరిగి డబ్బుతెచ్చుకొని 'అప్పగారింట్లో భోజనంచేసి చాలా రాత్రయిన తరువాత ఇంటికి వచ్చాడు. అతని ఆలస్యానికి కారణమడగకుండానే, రెండు నెలల క్రితం తన మెడలోని 'లాకెట్'అమ్మేసి కొనుక్కున్న బట్టల మిషన్ దగ్గర కూర్చుంది—శరీరాన్ని పక్కమీద చేరవేసేటప్పటికి అతని మనస్సులోకి ఎన్నో ఆలోచనలు దట్టంగా చేరుకున్నై. ఉద్యోగం చేయాలని అతను నిశ్చయించుకున్నాడు. పచ్చని పైరుచేలు సన్నగాలికి కొట్టుకునే రెప రెపలకూ, గోదావరీ ఇసుక తిన్నెల సోయగానికి, అతను దూరం కావలసి వస్తుంది. గానుగ ఎద్దులా రోజంతా డ్రాఫ్ట్సు వ్రాయాల్సుంటుంది. కిటికీనుండివచ్చే చల్లగాలికి అతని ఆలోచనలు ఎగిరిపోయాయి. హాయిగా నిద్రపట్టింది.

*   *   *

మర్నాడే 126వ అప్లికేషన్ వ్రాసి పోస్టు చేశాడు. భవితవ్యం కళ్ళముందు సంచరిస్తున్నట్లయిందతనికి. ఇంటికి ఆలోచనలతో కొట్టుకొచ్చాడు. దొడ్లో కూరగాయల్ని, పూల మొక్కల్ని పెంచుతూవుంది సీత—

"ఏదైనా ఉద్యోగం దొరికితే ఇవన్నీ వదలిపెట్టాలి. ఎందుకీ తలనొప్పి పని, ఊరుకుందూ!" అన్నాడు విశ్వం, సీత మొక్కలకు, ఒగుర్చుకుంటూ నీళ్ళు తోడుతున్నప్పుడు—

"ఏదో పెద్ద పల్లెటూరి వాడినని గర్విస్తున్నారు! మీ ప్రతి నాడియందు పట్నవాసపు ఉద్దేశాలే" అంది చేతులు కడుక్కొంటూ—ఆమెవైపే ఆశ్చర్యంగా చూస్తూ మాట్లాడలేక పోయాడు. సీత చీరమార్చుకొని వంట ప్రయత్నంలో నిమగ్నమైంది. నాలుగు రోజుల్లో అతని అప్లికేషన్ మీద అధికార సంతకంపడి అతనికి తిరిగి జవాబు వచ్చింది. దగ్గర పట్నంలోనే కంపెనీలో టైపిస్టు ఉద్యోగం—నాలుగు రోజుల్లోనే స్వీకృత పత్రం పుచ్చుకొని సీతకు చూపించాలని

ఆతురత పడ్డాడు. పట్నంవెళ్లి ఆమెకు మంచిరకం చీరలూ తనకు సూట్లు తెచ్చుకున్నాడు.

"ఆ 'వేణి' కథ ఎప్పుడు పూర్తిచేస్తారు" అంది ఎక్కడికో వెడుతున్న విశ్వాన్ని వెనక్కిపిల్చి—

"కలం ఎంతఅరగదీసినా రెండు పుంజీలకన్న ఎక్కువ రాదు కదా! తీరికవుంటే చూస్తాన్లే" అన్నాడు నిశ్చింతగా—

"దరిద్ర భారతదేశపు రైతుకు పొదుపుగా కాలక్షేపం చేయడం శతాబ్దాలనుంచి వస్తోంది" అంది వ్యంగ్యంగా—ఎక్కడికో వెళ్ళేవాడు ఆగిపోయి తిరిగి కలం పుచ్చుకొని కూర్చున్నాడు.

"రోజూ పట్నం వెడుతున్నారు. కొత్త అత్తవారి నెవ్వరినైనా సంపాదించారేమిటి" అంది సీత మళ్ళీ—అతను మాట్లాడకుండా ఒకవైపున ఆమె మాటలు వింటూ, చిరునవ్వు నవ్వుకుంటూ, ఆమె కింతవరకూ కూడా తన ఉద్యోగం సంగతి చెప్పలేదు. పట్నంలో స్నేహితునితో చెప్పి ఇల్లు మాట్లాడాడు. మరునాడు స్వీకృతి పత్రం తీసుకొని సీతకు చూపిద్దామని వంటింట్లోకి వచ్చాడు—

"నిప్పంటించడానికి కిర్సనాయిలు లేదు మరి కాఫీ ఎలా త్రాగుదామని వచ్చారు?" అంది సీత— "ఇక ఆట్టే కాలం ఈ పొడువూళ్ళో గడపక్కర్లేదులే" అన్నాడు. తన ఉద్యోగాన్ని గురించి చెప్పడానికి ఇదే మంచి తరుణమని—

"విడాకులిచ్చేయడానికి ఆలోచిస్తున్నారా యేమిటి?" అంది నవ్వుతూ—

టైపుచేసిన స్వీకృతి పత్రం ఆమెచేతికందిస్తూ "పట్నంలో ఉద్యోగం .."అన్నాడు. అంతకు ముందు ఆమె ముఖంలో వ్యాపించిన ఆనంద రేఖలు అట్టే అదృశ్యమవడం అతను బాగా గమనించి విస్తుపోయాడు— "70 రూపాయల జీతం" అన్నాడు బలవంతంగా నోరు తెర్చుకొని— "సాయంకాలానికి సామానుసర్దు"—

'వేణి' కథ పూర్తి చేయక పోవడానికి ఇదా కారణం? పదిరూపాయలు ఆదాయంలేక పోయినా రాత్రిపగలూ కలం అరగదీసేవారే—పాతిక రూపాయలు వస్తోందనీ ఉద్యోగానికి సిద్ధమయారా?" అంది కోపంతో. విశ్వం ఏమీమాట్లాడలేదు. "మీరు ఉద్యోగం చేయనక్కర్లేదు. కథలు రాసుకుంటే చాలు" అంటూ ఆర్డరు కాగితం ముక్క ముక్కలు చేస్తూంటే విశ్వం చూడ లేక పోయాడు—ఎంతో ఆశ పెట్టుకొని బయలుదేరబోతున్న అతనిలో పెద్ద నిరాశ దేవతవచ్చి కూర్చున్నట్లయింది— "పిచ్చి పిల్ల—పిచ్చి పిల్ల .."అని ఏదో విసుగ్గా అంటూ అతను మళ్ళీ కథరాసుకుంటున్నాడు—

(హిందీ ఆధారం)

★

రాజ్యాంగ పరిషత్తు అధ్యక్షులైన గా॥ రాజేంద్ర ప్రసాద్‌గారు జనవరి 4వ తేదీని ఆంధ్ర మహిళా సభను చూడవచ్చిరి. బాలికల గౌరవ వందనానంతరము వారు ఇక్కడ సభ్యురాండ్ర కృషిని తిలకించి, వారి సేవాయుతమైన కార్య క్రమమును ప్రశంసించిరి. సభ్యురాండ్ర గానమును ప్రశంసించిరి. కార్యదర్శిని శ్రీమతి దుర్గాబాయమ్మగారు అధ్యక్షుని అవిరామమైన కార్యక్రమములో, యీ సేవా సంస్థను జూడవచ్చినందులకు కృతజ్ఞతను తెలిపిరి.